క్లుప్తంగా

వార్డు మెంబర్ రాణెమ్మకు మంత్రి ఓదార్పు



రాణెమ్మను ఓదారుస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: వడమాలపేట పంచాయతీ వార్డు మెంబర్ రాణెమ్మ కుమారుడు సుధాకర్ ఇటీవల మృతి చెందాడు. మంగళవారం మంత్రి పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా వడమాలపేటలోని రాణెమ్మ ఇంటికి వెళ్లి సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని రాణెమ్మను ఓదార్చారు.

పరామర్శ..



భారతిని పరామర్శిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం (నగరి) : మండలంలోని కేవీపురం హరిజనవాడలో వార్డు మెంబర్ భారతి భర్త ఇటీవల మృతిచెందారు. మంగళవారం కేవీపురం గ్రామానికి వెళ్లిన మంత్రి ఆర్కే రోజా భారతిని పరామర్శించారు. అలాగే మహారాజపురంలో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రకాష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం కాళికాపురం శ్మశాన దారి పనులను పరిశీలించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు

పుత్తూరు: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంపీపీ మునివేలు అన్నారు. మంగళవారం పుత్తూరు మండలం వేపగుంట హైస్కూల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సీఎం జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, నాడు–నేడు వంటి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గిరిజా ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరిలో..



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

నగరి : మున్సిపల్ పరిధిలోని పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివే విద్యార్థులకు మంగళవారం బైజూస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ మోహన్‌రాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. ప్రధానోపాధ్యాయులు టీవీ రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు సాంకేతికంగా వృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు మనోహర్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత పిళ్లారికుప్పం



క్రీడాసామగ్రిని అందుకుంటున్న విజేత జట్టు

శ్రీరంగరాజపురం : ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పిళ్లారికుప్పం జట్టు విజేతగా నిలిచిందని ఎంపీడీఓ కృష్ణ తెలిపారు. మంగళవారం మండల స్థాయిలో క్రికెట్ విజేతగా నిలిచిన పిళ్లారికుప్పం జట్టు సభ్యులకు కిట్లు అందజేశారు. మండల కన్వీనర్ మణి, నాయకులు జనార్దన్, సీనియర్ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

పెనుమూరు(కార్వేటినగరం): విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని గొల్లవీధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు .. గొల్లవీధికి చెందిన వివేక్‌యాదవ్, శంకరమ్మ పాడి ఆవులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మంగళవారం యథావిధిగా తమ పాడి ఆవులను మేత కోసం గుట్టకింద పల్లె సమీపంలో ఉన్న వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఉన్న విద్యుత్ తీగలు పాడి ఆవుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

తడుకుపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు ఓటు వేయడాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ, కొత్తూరు హైస్కూల్‌లో ఓటు వేయడానికి క్యూలో నిలబడిన విద్యార్థులు, పెనుమూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న తహసీల్దార్ కళావతి, ఓటు వేస్తున్న విద్యార్థి









- ఎన్నికల సరళిపై విద్యార్థులకు శిక్షణ
- ఓటు విలువ తెలుసుకోండి
- విద్యార్థులకు ఓటు వేసే విధానంపై మాక్‌పోలింగ్

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

నగరి : ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటే గనుక విద్యార్థి దశ నుంచే దానిపై అవగాహన పెంచుకోవడం అవసరమని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. విద్యార్థి స్థాయి నుంచే విద్యార్థులు కూడా ఓటు వేసే విధానాన్ని, ఓటు విలువను తెలుసుకోవాలన్న ప్రభుత్వ సంకల్పం మంగళవారం గంట సమయం పాటు స్కూళ్లను పోలింగ్ బూత్‌లుగా మార్చేసింది. విద్యార్థులే ఓటర్లుగా, అభ్యర్థులుగా, ఎన్నికల అధికారులుగా అవతారమెత్తారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ద్వారా నామినేషన్లు దాఖలు చేయడం, వారికి బ్యాలెట్ పేపర్లు ఇచ్చి ఓటు వేయించడం, ఓట్లు లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు జారీచేయడం అంటూ ఎన్నికల ప్రక్రియలోని ప్రతి అంశంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. మాక్ ఎన్నికల సందర్భంగా పాఠశాలల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. తడుకుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మున్సిపల్ పరిధిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీదేవి ఓటు వేసే విధానంపై నిర్వహించే అవగాహనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన నిర్వహించే ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి విభేదాలు లేకుండా దేశంలో నివసించే 18 ఏళ్లు నిండిన పౌరులు అందరికీ భారత రాజ్యాంగం ఆర్టికల్ 326 ద్వారా ఓటు హక్కును కల్పిస్తోందని విద్యార్థులకు స్పష్టం చేశారు.



పాలసముద్రం: మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

అవగాహన తప్పనిసరి

పెనుమూరు(కార్వేటినగరం): ఓటు వినియోగంపై ప్రతి పౌరునికి అవగాహన ఉండాలని తహసీల్దార్ కళావతి అన్నారు. మంగళవారం పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎంఈఓ భాస్కర్‌నాయుడు, కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

పాలసముద్రం : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మనోహర్ నాయుడు, చక్రధరరావు పాల్గొన్నారు.

విద్యార్థులే పోలింగ్ అధికారులు

శ్రీరంగరాజపురం : మండలంలో 49 కొత్తపల్లిమిట్ట జెడ్పీ హైస్కూలులో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంఈఓ అరుణాచలంరెడ్డి, ఉపాధ్యాయులు శాంతి, షణ్ముగం పాల్గొన్నారు.

మాక్ పోలింగ్ : ఆర్‌ఓ భవాని

గంగాధర నెల్లూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాక్‌పోలింగ్ నిర్వహించి, ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మండల కార్యాలయంలో రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించి, ఓటరు తుదిజాబితా ప్రతులను అందజేశారు. ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, ఎన్నికల డీటీ విజయకృష్ణ పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన అవసరం

కార్వేటినగరం: విద్యార్థి దశ నుంచే ఓటింగ్ ప్రక్రియపై అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అలాగే బాలికల ఉన్నత పాఠశాల, డీఎం పురం ఉన్నత పాఠశాల, లక్ష్మీనరసింహ కళాశాలల్లో మాక్ పోలింగ్ నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుబ్బారావు, హరిబాబు, రాజశేఖర్, కార్తీక్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌పై అవగాహన

నింద్ర: మండల కేంద్రం నింద్ర ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణపై మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓలు వసుమతి, శ్రీధర్ రాజు, హెచ్‌ఎం శివయ్య తదితరులు పాల్గొన్నారు.









శ్రీరంగరాజపురం: మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు, గంగాధరనెల్లూరులో మాక్ పోలింగ్‌పై విద్యార్థులకు వివరిస్తున్న డీటీ విజయకృష్ణ, ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు, మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యార్థులు సాంకేతికంగా మెరుగుపడాలి





ఆన్‌లైన్‌లో సూచనలిస్తున్న డిగ్రీకళాశాలల కమిషనర్, హాజరైన అధ్యాపకులు

నగరి : విద్యార్థులు సాంకేతికంగా మెరుగుపడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కమిషనర్ డా.పోలా భాస్కర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నగరి నోడల్ రీసోర్స్ సెంటర్ విభాగం తరపున నిర్వహించే మూడు రోజుల శిక్షణా శిబిరం ప్రారంభమైంది. యునెస్కో వారి 'విద్యార్థుల్లో స్వీయ నిర్దేశకత్వం, భావపూరిత శిక్షణ సానుభూతి, దయ' అనే అంశంపై నిర్వహించిన ఈ శిక్షణ శిబిరానికి జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులు అధికారికంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కమిషనర్ డా.పోలా భాస్కర్ ఆన్‌లైన్‌లో అధ్యాపకులకు పలు సూచనలు అందించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, సాంకేతికంగా విద్యార్థులు మెరుగైన విద్యను అందుకోవడానికి, ఒత్తిడిని అధిగమించి మంచి భవిష్యత్‌ను ఏర్పరచుకోవడానికి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. నైపుణ్యాభివృద్ధి నిపుణులు శోభితా రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్సాహంగా అధ్యయనం చేయడానికి విలువలతో కూడిన విద్యను అందుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యాపక బృందానికి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలోని అధ్యాపకులు హాజరై నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణా శిబిరాన్ని నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. రోజుకు 40 మంది వంతున మూడు రోజుల పాటు, నోడల్ రీసోర్స్ సెంటర్ అనుబంధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 120 మంది అధ్యాపకులు శిక్షణా శిబిరానికి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కర రాజు, నగరి రీసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ డా.పంకజ, అధ్యాపకులు డా.మునెయ్య, డా.రమేష్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర





మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

వెదురుకుప్పం: గ్రామీణాభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం వెదురుకుప్పంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. పంచాయతీ అభివృద్ధిలో ప్రజలను కూడా భాగస్వాములు చేయాలన్నారు. వనరుల వినియోగంతో పాటు పంచాయతీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పంచాయతీ రాజ్ చట్టంలోని హక్కులు, విధులపై అవగాహన పెంచుకుని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఓ హరినాథ్‌బాబు, ఈఓపీఆర్డీ పురుషోత్తం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

పాలసముద్రం: పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ తెలిపారు. మంగళవారం వెంగళరాజుకుప్పం సచివాలయం పరిధిలో వైద్యాధికారి మోహన్‌కృష్ణ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 236 మందికి వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు, మాత్రలు తీసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, కార్యదర్శి సుధ, ఇందిర, మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ఆరోగ్యరక్ష

పెనుమూరు(కార్వేటినగరం): జగనన్న ఆరోగ్య సురక్ష పేదల పాలిట ఆరోగ్య సురక్ష అని సర్పంచ్ మురళీకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సామిరెడ్డిపల్లె సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జమున, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మీనా, సయ్యద్, ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానం అభివృద్ధి పనులు ప్రారంభం



మంత్రి రోజాను సత్కరిస్తున్న గ్రామస్తులు

విజయపురం (నగరి) : మండలంలోని కాళికాపురం గ్రామానికి నాలుగు దశాబ్దాలుగా ఉన్న శ్మశానానికి రోడ్డు సమస్యను మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా పరిష్కరించారు. మంగళవారం రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. గతంలో ఉన్న పాలకులు ఎవరూ పట్టించుకోక వదిలేసిన ఈ దారి పనులను మంత్రి తన చారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పరిశీలనకు విచ్చేసిన మంత్రికి దుశ్శాలువలతో గ్రామస్తులు స్వాగతం పలికారు. శ్మశానం కృతజ్ఞతలను తెలియజేశారు. ఆమె వెంట పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అక్కచెల్లెళ్లకు ఆర్థిక ఆసరా



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

పాలసముద్రం : అక్కచెల్లెళ్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, వారికి ఆర్థికంగా ఆసరానిస్తూ వారి కుటుంబాల ఉన్నతికి తోడ్పాటు అందిస్తోందని సర్పంచ్ గాలి మహేష్ బాబు తెలిపారు. మంగళవారం మండలంలో జరిగిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో మహిళల కష్టాలు, వారి ఆర్థిక ఇబ్బందులను కళ్లారా చూశారన్నారు. అందుకే వారికి అండగా నిలిచారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగో విడత రుణమాఫీ చేశారని తెలిపారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజీవ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

కార్వేటినగరం: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం కేశవులు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నేతాజీ అక్షర క్రమాన్ని పూలతో ఏర్పాటు చేసి నివాళులర్పించారు. జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి, హరిత, సరస్వతి, మాలతి, వెంకటరమణయ్య, ఢిల్లీబాబు, చిన్నయ్యశెట్టి, రాములు, తిరుమలరాజు, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుమూరు: నేతాజీ సుబాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా గౌరవ సలహాదారు దేవళ్ల భాస్కర్, కిరణ్, కోటయ్య, నారాయణ, పెద్దబ్బ, వెంకటేష్, ఉమామహేశ్వర్, బాలాజీ, పరదేశీ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు,



పెనుమూరులో..

ఆరోగ్యశ్రీ సేవలను సద్వినియోగం చేసుకోండి

- జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవి

పుత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం వడమాలపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ పథకం అమలుపై సమీక్షా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రూ.5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు. ప్రస్తుతం కొత్త ఫీచర్ స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. వడమాలపేటలో 7480 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 5372 కుటుంబాలకు మాత్రమే కార్డులు అందాయని వివరించారు. మిగిలిన 2108 కుటుంబాలకు ఈకేవైసీ చేయించి కార్డులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, వైద్యాధికారి చక్రపాణి, సీహెచ్‌ఓ పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, సీహెచ్‌ఎస్ మంజుల, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

కార్వేటినగరం: రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డీఎం పురం సర్పంచ్ తులసి తెలిపారు. డీఎం పురం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో టాటా ట్రస్టు ఆస్పత్రి ఆధ్వర్యంలో బీపీ, షుగర్, హైపటైటిస్, నోరు, రొమ్ము, గర్భసంచి తదితర ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, పేదలకు వైద్య సౌకర్యాలు కల్పిస్తున్న రాస్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ధనశేఖర్‌యాదవ్, టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్యబాబు, రెడ్డికుమారి, అర్చన, వినతి, రాస్ కోఆర్డినేటర్ హేమంత్ పాల్గొన్నారు.

చురుగ్గా కులగణన

పాలసముద్రం : మండలంలో ఎంపీడీఓ రామనాథరెడ్డి పర్యవేక్షణలో కులగణన చురుగ్గా కొనసాగుతోంది. మంగళవారం కేజే పురం సచివాలయ పరిధిలోని బోయదుఇండ్లు, కృష్ణజిమ్మాపురం సచివాలయంలో కులగణన చేశారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ సర్వే ప్రకియ సాగుతుందని, నిర్దేశిత గడుపులో పక్కాగా కులగణన చేపట్టనున్నట్లు ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు.



బోయదుఇండ్లులో కుల గణన సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు